# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం

7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :03 | 17-07- 2026 | శుక్రవారం | పేజీలు: 4 | వెల రూ. 03


# తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం:



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని పటిష్టం చేసేందుకు మరియు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచే యువతకు అండగా నిలుస్తూ, వారికి ప్రోత్సాహకరంగా భారీ క్యాష్ రివార్డులతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలను కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అత్యంత విజయవంతంగా ముగిసిన సీజన్-1 'టీజీ-20 క్రికెట్ లీగ్' లో విజేతగా నిలిచిన 'హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్' జట్టు సభ్యులు ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చాంపియన్ జట్టు సభ్యులందరినీ శాలువాలతో సత్కరించి, అభినందించిన ముఖ్యమంత్రి, వారికి నగదు బహుమతుల చెక్కులను స్వయంగా అందజేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడాకారుల ప్రయోజనాలు మరియు మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రానికి ఒక ప్రతిష్టాత్మకమైన, ప్రత్యేకమైన సరికొత్త స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చామని వెల్లడించారు. అంతేకాకుండా, క్రీడా రంగంలో పరిశోధనలు, శాస్త్రీయ శిక్షణ కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గచ్చిబౌలి స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరించి, విశ్వవ్యాప్త క్రీడా వేదికగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందని వివరించారు. ఒకప్పుడు జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక క్రీడలకు హైదరాబాద్ నగరం ప్రధాన వేదికగా నిలిచిందని, ఆ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకువస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులలో దాగి ఉన్న అద్భుతమైన ప్రతిభను వెలికితీసి, వారికి తగిన వేదికను కల్పించడంలో ఈ 'టీజీ-20' క్రికెట్ లీగ్ ఒక అద్భుతమైన అవకాశంగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జట్టు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిల్లో ఆడి మన దేశ కీర్తి ప్రతిష్టలను నిలబెట్టే గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏ రంగంలోనైనా ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే పూర్తి స్థాయి ఏకాగ్రత (ఫోకస్) ఎంతో అవసరమని, మనం ఎంచుకున్న క్రీడ లేదా రంగం పట్ల అంకితభావం, గౌరవం మరియు నిరంతర ఆసక్తిని కలిగి ఉండాలని క్రీడాకారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అత్యంత ఉత్సాహభరితంగా సాగిన ఈ కార్యక్రమంలో ఈనాడు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, ప్రముఖ కోచ్ పుల్లెల గోపీచంద్‌తో పాటు క్రీడా శాఖ ఉన్నతాధికారులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు

# పూరీ జగన్నాథ రథయాత్రలో ఘోర ప్రమాదం

## తొక్కిసలాటలో ఒకరు మృతి, 120 మందికి పైగా గాయాలు



ఒడిశా బ్యూరో

ఒడిశాలోని జగత్ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రమైన పూరీలో జరుగుతున్న జగన్నాథుడి రథయాత్ర ఉత్సవాల్లో గురువారం నాడు ఘోర విషాదం చోటుచేసుకుంది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రా దేవి రథాలను దర్శించుకునేందుకు దేశవిదేశాల నుంచి తరలివచ్చిన లక్షలాది భక్తుల నడుమ ఒక్కసారిగా ఊహించని విధంగా తొక్కిసలాట జరిగింది. ఈ ఘోర దుర్ఘటనలో ఒక భక్తుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, సుమారు 120 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులలో కొందరి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్యులు మరియు ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘోర ప్రమాదం రథాలను లాగే సమయంలో చోటుచేసుకుంది. జగన్నాథుడి రథాన్ని లాగేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఎగబడ్డారు. ఆ సమయంలో రథాల ముందు ఉన్న 'బడదండ' (గ్రాండ్ రోడ్) మార్గంలో ఒకేసారి వేలాది మంది ముందుకు దూసుకురావడంతో భక్తుల మధ్య తీవ్రమైన నెట్టివేత ప్రారంభమైంది. గుంపులో ఉన్న కొందరు మహిళలు, వృద్ధులు కిందపడిపోగా, వారిపై నుంచి వెనుక ఉన్న జనసమూహం ముందుకు కదలడంతో తొక్కిసలాట తీవ్రరూపం దాల్చింది. ఈ గందరగోళ పరిస్థితిలో ఊపిరి ఆడక, తొక్కిసలాటలో నలిగిపోయి అనేక మంది స్పృహ తప్పి పడిపోయారు.

సమాచారం అందిన వెంటనే ఆలయ కమిటీ సభ్యులు, పోలీసు ఉన్నతాధికారులు అదనపు బలగాలతో రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. రద్దీని పక్కకు తప్పించి, గాయపడిన భక్తులను రక్షించేందుకు విపత్తు నిర్వహణ బృందాలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. క్షతగాత్రులందరినీ వెంటనే అంబులెన్సుల ద్వారా పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి, నిపుణులైన వైద్య బృందాలతో చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన మరికొందరిని మెరుగైన వైద్యం కోసం కటక్‌లోని ఎస్సీబీ మెడికల్ కాలేజీకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

గత ఏడాది జరిగిన జగన్నాథ రథయాత్రలోనూ ఇలాంటి ఘోరమైన తొక్కిసలాట జరిగి ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, యాభై మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మరియు ఆలయ పాలక మండలి ఈ ఏడాది అదనపు భద్రతా ఏర్పాట్లు చేశామని, సీసీటీవీ కెమెరాలతో నిఘా ఉంచామని ప్రకటించినప్పటికీ, మళ్లీ అదే తరహా ప్రమాదం పునరావృతం కావడంపై భక్తులు మరియు స్థానికులు తీవ్ర ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా భారీ జనసమూహాన్ని క్రమబద్ధీకరించడానికి మరింత పటిష్టమైన సాంకేతికతను, ప్రత్యేక క్యూ లైన్ల విధానాన్ని అమలు చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం పూరీ పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు గట్టి పహారా ఏర్పాటు చేశారు.

# గోదావరి జలాల వినియోగానికి ప్రత్యేక ప్రణాళిక..

## చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్ బ్యూరో

గోదావరి నదిలో ప్రవహించే నీటిని గ్రావిటీ, లిఫ్ట్ ఇరిగేషన్ విధానాల ద్వారా గరిష్టంగా వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, సీతమ్మ సాగర్ బహుళ ప్రయోజన ప్రాజెక్టులను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

వాతావరణ మార్పులు, భవిష్యత్ నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఇటీవల దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సమ్మక్క బ్యారేజ్ నుంచి పూర్తి స్థాయిలో నీటిని ఎత్తిపోసే ప్రక్రియను సమీక్షించినట్లు, ఇప్పుడు సీతారామ ప్రాజెక్టు పనుల వేగవంతంపై క్షేత్రస్థాయిలో ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. తెలంగాణలో గోదావరి జలాలను చివరి ఆయకట్టు వరకు చేరవేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను రూ. 3,505 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా రూపొందించారని గుర్తు చేశారు.



రాష్ట్ర విభజనకు ముందే దాదాపు రూ. 2,000 కోట్లు ఖర్చు చేశారని, మిగిలిన రూ. 1,505 కోట్లతో పనులు పూర్తయ్యే అవకాశముండగా, తర్వాతి ప్రభుత్వం రీడిజైన్ పేరుతో ప్రాజెక్టు వ్యయాన్ని సుమారు రూ. 24 వేల కోట్లకు పెంచిందని ఆరోపించారు. దీనివల్ల అదనంగా రూ. 7,500 నుంచి రూ. 8,000 కోట్ల భారం పడిందని విమర్శించారు.

గత ప్రభుత్వం చేపట్టిన మార్పుల కారణంగా సమస్యలు తలెత్తినా, ఇప్పటికే భారీగా ప్రజాధనం ఖర్చయినందున ప్రాజెక్టును నిలిపివేయకుండా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. పంపిణీ కాలువలు, రిజర్వాయర్ల సామర్థ్యం, లింక్ కాలువలు, సొరంగ మార్గాల నిర్మాణంతో వైరా, పాలేరు రిజర్వాయర్లను అనుసంధానం చేసి సత్తుపల్లి వరకు నీరు అందించేలా పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు.

ప్రతి నెల కార్యాచరణ ప్రణాళికతో సమీక్షలు నిర్వహిస్తూ పనులు పూర్తి చేస్తామని, ప్రజాధనంలో ఒక్క రూపాయి కూడా వృథా కాకుండా సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లా రైతుల సాగునీటి కలను సాకారం చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# తెలంగాణ సంస్కృతికి సమున్నత ప్రతీక బోనాల పండుగ:



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అస్తిత్వానికి, విశిష్టమైన సంస్కృతి మరియు సాంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే బోనాల పండుగను భక్తులందరూ భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా జగదీశ్ మందిరంలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, స్వయంగా బోనం నెత్తిన ఎత్తుకుని ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ తదితర ప్రముఖులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, బోనాల పండుగ వెనుక ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తుచేశారు. పూర్వ కాలంలో కలరా, ప్లేగు వంటి భయంకరమైన అంటువ్యాధులు ప్రబలి జనం ప్రాణాలు కోల్పోతున్న తరుణంలో, ప్రకృతి స్వరూపిణి అయిన గ్రామ దేవతలను శాంతింపజేయడానికి ప్రజల అచంచల విశ్వాసంతో ప్రారంభమైన ఈ పండుగ, నేటికీ చెక్కుచెదరని భక్తితో కొనసాగుతోందన్నారు. అమ్మవారికి మట్టి కుండలోనే బోనం వండి సమర్పించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారమని, నేటి తరం భక్తులు కూడా ప్లాస్టిక్, స్టీలు పాత్రలకు దూరంగా ఉంటూ ఈ మట్టి కుండల సాంప్రదాయాన్ని విధిగా కొనసాగించాలని కోరారు. మట్టి కుండల వినియోగం పెరగడం వల్ల పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా, సమాజంలో అంతరించిపోతున్న కుమ్మరి వృత్తిదారుల కుటుంబాలకు ఉపాధి లభించి వారి ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగవుతాయని మంత్రి ఆకాంక్షించారు.

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, రాష్ట్రంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవాలని, రైతన్నలకు మేలు జరిగి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. కరువు కాటకాలు లేకుండా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థించినట్లు ఆమె పేర్కొన్నారు.

మరో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంలో ప్రతి ఒక్క పౌరుడిపై ఉందన్నారు. ఆధునిక కాలంలో పాశ్చాత్య పోకడలు పెరుగుతున్నప్పటికీ, మన మూలాలను మర్చిపోకుండా ఇటువంటి పండుగలను ఘనంగా నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. బోనాల వంటి ఉత్సవాలు కేవలం మతపరమైన ఆచారాలకే పరిమితం కాకుండా, సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకేతాటిపైకి తెచ్చి ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని ఆయన వివరించారు. తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడంలో బోనాల పండుగ పోషిస్తున్న పాత్ర అద్వితీయమైనదని, ప్రభుత్వం కూడా ఈ ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రులు ఈ

తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871


# నిర్మల్ జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా రేషన్ దందా..!

## పక్కదారి పడుతున్న పేదల బియ్యం, సరిహద్దులు దాటుతున్న నల్లబజారు నెట్‌వర్క్



నిర్మల్, జూలై 16 తెలంగాణ వెన్నెల వాక్కు
నిర్మల్ జిల్లాలో నిరుపేదల ఆకలి తీర్చడం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ (పీడీఎస్) బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అనేది కేవలం ఏదో ఒక గ్రామానికో లేక ఒక నిర్దిష్ట మండలానికో పరిమితం కాలేదు. ఒక వ్యవస్థీకృత ముఠాలా ఏర్పడిన అక్రమార్కులు జిల్లా వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరించి, పేదల బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ రూ. కోట్లు గడిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా లోపం, పౌరసరఫరాల శాఖ అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని, దళారులు ఏకంగా పక్క రాష్ట్ర సరిహద్దులు దాటించి మరీ ఈ దందాను సాగిస్తున్నారు.
ఇటీవల ఖానాపూర్ పట్టణ శివారులో జరిగిన ఒక రోడ్డు ప్రమాదం ఈ అక్రమ రవాణా తీవ్రతను కళ్లకు కట్టింది. వేగంగా వెళ్తున్న ఒక డెలివరీ వ్యాన్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి, డ్రైనేజీ కాలువలో ఇరుక్కుపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారవగా, స్థానికులు పరిశీలించగా అందులో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం బస్తాలు కనిపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, అక్రమంగా తరలిస్తున్న సుమారు 42 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని చుట్టుపక్కల గ్రామాల నుండి సేకరించి, ఒక రహస్య నిల్వ కేంద్రానికి తరలిస్తున్నట్లు తేలింది. ఈ ఒక్క ఘటన చాలు జిల్లాలో రేషన్ దందా ఎంత గుట్టుచప్పుడు కాకుండా, ఏ స్థాయిలో సాగుతోందో చెప్పడానికి.
నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా రేషన్ పంపిణీ జరిగే సమయంలో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. లబ్ధిదారుల బలహీనతలను ఆసరాగా చేసుకుని, కొందరు దళారులు నేరుగా ఇళ్ల వద్దకే వెళ్లి కిలోకు కేవలం పది నుండి పదిహేను రూపాయల లోపు చాలా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా రేషన్ డీలర్ల పరోక్ష సహకారంతోనే ఈ దందా నడుస్తోందన్న విమర్శలు ఉన్నాయి. లబ్ధిదారుల వేలిముద్రలు తీసుకున్న అనంతరం, వారికి బియ్యం ఇవ్వకుండా నేరుగా దళారుల వాహనాల్లోకే లోడ్ చేస్తున్నట్లు సమాచారం. ఇలా సేకరించిన బియ్యాన్ని గ్రామాల్లోని చిన్న చిన్న ఇళ్లలో, పశువుల పాకలలో లేదా రహస్యంగా నిర్మించిన షెడ్లలో గుట్టలుగా నిల్వ చేస్తున్నారు.
అనంతరం అర్ధరాత్రి వేళల్లో చిన్న వాహనాల ద్వారా ఈ బియ్యాన్ని జిల్లా కేంద్రంలోని ప్రధాన రహస్య గోదాములకు చేరవేస్తున్నారు. అక్కడ నుండి ఈ బియ్యం స్థానిక రైస్ మిల్లులకు చేరుకుంటోంది. అక్కడ పీడీఎస్ బియ్యాన్ని పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్చి, ఆకర్షణీయమైన బ్రాండెడ్ సంచులుగా మార్చి తిరిగి బహిరంగ మార్కెట్ లోకి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మరికొన్ని ముఠాలు ఒక అడుగు ముందుకు వేసి, ఈ బియ్యాన్ని ఏకంగా పొరుగున ఉన్న మహారాష్ట్ర సరిహద్దులు దాటించి భారీ లాభాలు పొందుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.
ఈ అక్రమ రవాణాపై పౌర సరఫరా శాఖ అధికారుల వివరణ కోరగా, జిల్లాలో అక్రమ బియ్యం రవాణాకు సంబంధించిన ఎటువంటి వ్యవహారాలు జరగడం లేదని వారు స్పష్టం చేశారు. ఆరోపణలు నిరాధారమని, జిల్లాలో పంపిణీ వ్యవస్థ అంతా పారదర్శకంగా సాగుతోందని తెలిపారు. ఎక్కడైనా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అధికారులు ఈ వ్యవహారాన్ని నిరాకరిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తరచుగా దొరుకుతున్న అక్రమ బియ్యం వాహనాలు, తాజాగా ఖానాపూర్‌లో పట్టుబడిన 42 క్వింటాళ్ల బియ్యం ఘటన అధికారుల ప్రకటనలపై ప్రజల్లో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, క్షేత్రస్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ నిఘా విభాగాలను ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేవలం రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడో, నామమాత్రపు తనిఖీల్లోనో కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, జిల్లా వ్యాప్తంగా ఉన్న అనుమానిత గోదాములు, రైస్ మిల్లులపై ఆకస్మిక దాడులు నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులపై పీడీ యాక్ట్ కింద కఠినమైన కేసులు నమోదు చేయాలని, అప్పుడే ఈ దోపిడీకి అడ్డుకట్ట పడి ప్రభుత్వ ఉచిత బియ్యం పథకం నిజమైన పేదలకు అందుతుందని జిల్లా ప్రజలు గట్టిగా అభిప్రాయపడుతున్నారు.

## ఎడ్‌బిడ్ ఫ్యూచర్ స్కూల్ విద్యార్థులకు పొలంలో 'ప్రత్యక్ష పొలం పాఠం' బోధన



ముధోల్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల ఫ్యూచర్ స్కూల్ విద్యార్థులకు వ్యవసాయంపై వినూత్న పద్ధతిలో ప్రత్యక్ష క్షేత్రస్థాయి బోధన నిర్వహించారు. ప్రాథమిక తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలోని 'పొలం' పాఠంలో భాగంగా, విద్యార్థులను ఉపాధ్యాయులు నేరుగా గ్రామంలోని వ్యవసాయ పొలానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పొలంలో రైతులు చేసే పనులు, వివిధ రకాల పంటలు, వ్యవసాయ పరికరాల వినియోగం, రైతులు పడే శ్రమ, పంటల సాగు విధానాల గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యక్షంగా చూపించి వివరించారు. పాఠ్యాంశాన్ని కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా ప్రత్యక్ష అనుభవంతో నేర్పడం వల్ల పిల్లలు విషయాన్ని సులభంగా అర్థం చేసుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ తెలిపారు. ఈ అనుభవ బోధన విద్యార్థుల్లో పరిశీలనా శక్తిని పెంపొందించడంతో పాటు వ్యవసాయం పట్ల అవగాహన, రైతుల పట్ల గౌరవ భావాన్ని పెంపొందిస్తుందన్నారు.

## రైతులకు పంటల సమగ్ర యాజమాన్యంపై శాస్త్రవేత్తల అవగాహన




దిలావర్పూర్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో వ్యవసాయ కాలేజీకి చెందిన బి.ఎస్‌సి. (వ్యవసాయం) నాలుగో సంవత్సరం విద్యార్థులకు, గ్రామ రైతులకు వరి, పత్తి, ఆయిల్ పామ్ పంటలలో చీడపీడలు, వ్యాధుల నివారణ మరియు పంట నిర్వహణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, సమన్వయకర్త డాక్టర్ కె. రాహుల్ విశ్వకర్మ రైతులకు పంట సంరక్షణకు సంబంధించిన పలు కీలక సూచనలు చేశారు. వరి పంటలో అగ్రోమిన్ మ్యాక్స్ లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పత్తి పంటలో రసంపీల్చే పురుగుల నివారణకు ఫిప్రోనిల్ పిచికారీ చేయాలన్నారు. ఆయిల్ పామ్ లో కొమ్ము పురుగు నివారణకు ట్రాప్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు ఎ. చినరెడ్డి, ఎం. రాజ్‌కుమార్ రెడ్డి, కె. బుచ్చారెడ్డి, వై. నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం అందించి మిత్రత్వాన్ని చాటిన అయ్యప్ప శ్రీనివాస్



ఆర్మూర్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్, అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ తన చిన్ననాటి పాఠశాల మిత్రుడు మంగళి కృష్ణ అకాల మరణం చెందినట్లు తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం మృతుడి నివాసానికి స్వయంగా వెళ్లిన అయ్యప్ప శ్రీనివాస్, మిత్రుడి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణ దహన సంస్కారాల నిమిత్తం అయ్యప్ప ఫౌండేషన్ తరపున 10,000 రూపాయల అత్యవసర ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి, అంత్యక్రియల ఊరేగింపులో స్వయంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సుధాకర్, ప్రవీణ్, రవి, నారాయణ, మణిదీప్, గంగసింగ్, సన్నీ పాల్గొన్నారు.

## తానూర్ మండల ఝరి(బి) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



తానూర్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తానూర్ మండల పరిధిలోని ఝరి(బి) గ్రామంలో లబ్ధిదారుల ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ నూతన గృహాలను హౌసింగ్ విభాగం ఏఈ (అసిస్టెంట్ ఇంజనీర్) మహేష్ బాబు గురువారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.
ఈ సందర్భంగా గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న వివిధ గృహాల స్లాబ్ పనులను ఆయన స్వయంగా తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఏఈ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు మరింత వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకు పనులు ప్రారంభించని వారు వెంటనే పనులు ప్రారంభించి నాణ్యతతో పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గైక్వాడ్ సాయినాథ్, యశోద సాయినాథ్, మల్లేష్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయ స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే



డొంకేశ్వర్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
డొంకేశ్వర్ మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన తహసీల్దార్ (తాసిల్దార్) శాశ్వత కార్యాలయ భవన నిర్మాణం కొరకు ఆర్మూర్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడిన డొంకేశ్వర్ మండలానికి భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉందన్నారు. శాశ్వత తాసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని కేటాయించేందుకు గ్రామస్తులందరూ సమిష్టిగా ఒకే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు

వేల్పూర్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వేల్పూర్ మండల పరిధిలోని ప్రముఖ గోవిందగిరి దివ్య యోగాశ్రమంలో గురువారం శ్రీ సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. వ్రతాల సందర్భంగా ఆశ్రమ ధ్యాన మందిరంలో భక్తులు సామూహికంగా భజనలు నిర్వహించారు. అనంతరం అన్నదాతల సమక్షంలో గోమాత పూజ, అన్నపూజలు శాస్త్రోక్తంగా జరిపారు. ఆశ్రమ ప్రాంగణంలో సాయంత్రం స్వామివారి పల్లకి సేవ కన్నులపండువగా సాగింది. పూజా కార్యక్రమంలో దంపతులు సుంకిశాల తనూశ్రీ నవీన్ గౌడ్, దీకొండ లావణ్య మాధవ్ పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అబ్బగోని జగదీశ్వర్ గౌడ్, నోముల గంగారెడ్డి, మోహన్, గడ్డం మల్లేష్, దమ్మాయి లక్ష్మి పాల్గొన్నారు.

## సోయాచిక్కుడు, పత్తి, కంది పంటల్లో పురుగుల ఉధృతిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

ముధోల్, జులై 16(తెలంగాణ వెన్నెల వాక్కు ):ఎల్ నినో ప్రభావం వాళ్ళ నిర్మల్ జిల్లాలో సాధారణ వర్షపాతం కన్నా 36 % తక్కువ నమోదు అవ్వటం జరిగింది అలాగే గత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడం వల్ల నేలలో తేమ తగ్గి మరియు అధిక ఉష్ణోగ్రతల వల్ల సోయాచిక్కుడు, పత్తి మరియు కంది పంటల్లో మొక్కల ఎదుగుదల మందగించే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల్లో వివిధ రకాల పురుగుల ఉధృతి పెరిగే అవకాశమున్నందున రైతులు తమ పొలాలను తరచూ పరిశీలిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన స్థానం ముధోల్ శాస్త్రవేత్త డా. ఆకుల దినేష్ సూచించారు. సోయాచిక్కుడు పంటలో కాండం తొలుచు ఈగ, ఆకుతినే గొంగళిపురుగులు, కంది పంటలో రసం పీల్చే పురుగులు, పత్తి పంటలో పచ్చదోమ, తామర పురుగులు, పేనుబంక, తెల్లదోమ వంటి పురుగుల ఉధృతి అధికంగా కనిపించే అవకాశం ఉందని తెలిపారు. వర్షాభావం, నేలలో తక్కువ తేమ, 30–35లీజ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత, తేమ ఒత్తిడి ఉన్నప్పుడు శిలీంధ్రం వల్ల సోయా పంటలో వేరు కుళ్లు వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 డబ్ల్యూ.పీ. ఏ 3 గ్రాములు/ లీటరు నీటికి కలిపి మొక్కల వేర్ల చుట్టూ డ్రెంచింగ్ చేయాలి సోయాచిక్కుడు పంటలో కాండం తొలుచు ఈగ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 17.8% ఎస్.ఎల్. ఏ 1 మి.లీ. లేదా బీటా–సైఫ్లూత్రిన్ 8.49% ం ఇమిడాక్లోప్రిడ్ 19.81% ఓ.డి. ఏ 1 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి గమనించిన వెంటనే ఇమిడాక్లోప్రిడ్ 17.8% ఎస్.ఎల్.ను 1:20 నిష్పత్తిలో కాండం పూత చేయాలని, అవసరమైతే ఫ్లోనికామిడ్ 50% డబ్ల్యూ.జి. ఏ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అదేవిధంగా, నేలలో తేమను సంరక్షించేందుకు అంతరకృషి నిర్వహించి కలుపు మొక్కలను పూర్తిగా తొలగించాలని, వర్షాభావ ఒత్తిడిని తగ్గించేందుకు 19:19:19 లేదా 13:0:45 వంటి నీటిలో కరిగే ఎరువులను ఆకులపై పిచికారీ చేయడం ద్వారా పంటల ఎదుగుదలకు తోడ్పాటు అందించవచ్చని సూచించారు.

## నూతనంగా ఎన్నికైన ముధోల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం





ముధోల్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నూతనంగా ఎన్నికైన ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాపేవార్ కిష్టయ్యను ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కిష్టయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతాయుత పదవిని ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు, జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మండలంలో అజేయ శక్తిగా మార్చేందుకు కష్టపడతానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీలు పోతన్న యాదవ్, బషీర్, సర్పంచులు సర్వేష్, కాంత్ రావు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, మాజీ సర్పంచ్ సాయినాథ్ పాల్గొన్నారు.

తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



# నిర్మల్ జిల్లాలో దొంగల బీభత్సం..!

## పల్లెల్లో నిద్రలేని రాత్రులు.. పోలీసు గస్తీ కరవై జనం బేజారు!

**నిర్మల్ జూలై 16 తెలంగాణ వెన్నెల వాక్కు**

నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో దొంగలు పంజా విసురుతున్నారు. ఒకప్పుడు అర్ధరాత్రి వేళల్లో సైరన్లు, హారన్లు మోగిస్తూ గ్రామాల్లో తిరిగిన పోలీసు వాహనాలు ఇప్పుడు పల్లెటూళ్ల వైపు కన్నెత్తి చూడకపోవడంతో దొంగలు పండగ చేసుకుంటున్నారు. పోలీస్ యంత్రాంగం యొక్క నిఘా లోపాన్ని ఆసరాగా చేసుకుని వరుసగా ఇళ్ల తాళాలు పగులగొడుతుండటంతో పల్లె ప్రజలు గుండెచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న దొంగతనాలతో జిల్లాలోని పల్లె ప్రజలు రాత్రి వేళల్లో కంటిమీద కునుకు లేకుండా కాపలా కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. శాంతిభద్రతల పరిరక్షణ పూర్తిగా గాడి తప్పిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఏడు మండలాల్లో అలజడి.. భయపడుతున్న పల్లెలు**

జిల్లాలోని దిలావర్ పూర్, నర్సాపూర్ జి,ముదోల్, తానుర్, నిర్మల్, లోకేశ్వరం, భైంసా, కుంటాల, సారంగాపూర్‌లి మండలాల్లో దొంగల ముఠాలు వరుస చోరీలతో తీవ్ర బీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ మండలాల్లోని ప్రధాన గ్రామాలతో పాటు శివారు పల్లెలను, చివరకు అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలను కూడా టార్గెట్ చేసుకుని దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ఉన్న ఇళ్లను, తాళాలు వేసి ఉన్న గృహాలను ఎంచుకుని పక్కా ప్రణాళికతో చోరీలకు పాల్పడుతున్నారు. రాత్రి వేళల్లోనే కాకుండా, గ్రామాల్లో పగటిపూట కూడా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తూ రెక్కీ నిర్వహిస్తున్నారని సమాచారం. దీంతో ఈ ఏడు మండలాల పరిధిలోని ప్రజలు ఎప్పుడు ఏ ఇల్లు గుల్లవుతుందోనని తీవ్ర భయాందోళనల మధ్య గడుపుతున్నారు.



**వర్షాలు లేక కరువు.. దొంగల వేట!**

సకాలంలో వర్షాలు పడకపోవడంతో జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయ పనులు లేక, చేతిలో పైసలు లేక, ఉపాధి దొరక్క ఒకపక్క గ్రామీణ ప్రజలు అల్లాడుతుంటే.. మరోపక్క ఈ దుర్భర కరువు కాలాన్ని దొంగలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పల్లెల్లో కరువు తాండవిస్తున్న తరుణంలో, ఇదే అదనుగా భావిస్తున్న దొంగల ముఠాలు అర్ధరాత్రి వేళల్లో పక్కాగా ఇళ్లను గుల్ల చేస్తున్నాయి. పగటిపూట వ్యాపారాల పేరుతో, గుజ్జరి సామాన్లు కొనేవారిలా గ్రామాల్లో తిరుగుతూ తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రి వేళల్లో వాటి తాళాలు పగులగొట్టి క్షణాల్లో నగదు, బంగారంతో పరారవుతున్నారు. ఉదయం లేచి చూసేసరికి ఇళ్ల తాళాలు విరిగిపోవడం, బీరువాల్లో దాచుకున్న కష్టార్జితం మాయమవడంతో బాధితులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

**పోలీసులకు అంతుచిక్కని వైనం!**

వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నా, క్లూస్ టీమ్స్ రంగంలోకి దిగుతున్నా దొంగల జాడ మాత్రం పోలీసులకు అంతుచిక్కడం లేదు. పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచడంలో, సరిహద్దుల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడంలో పోలీసు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరిహద్దు జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి వచ్చే ముఠాలు ఈ దోపిడీలకు పాల్పడుతున్నాయా లేదా స్థానికంగా ఉన్న పాత నేరస్థుల పనేనా అన్న కోణంలో విచారణ నత్తనడకన సాగుతోంది. రాత్రిపూట నామమాత్రంగా కూడా బ్లాకోల్ట్స్ గానీ, పెట్రోలింగ్ వాహనాలు గానీ పల్లెల్లో తిరగకపోవడంతోనే దొంగలు యథేచ్ఛగా తమ పని కానిచ్చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాగే వదిలేస్తే మున్ముందు పరిస్థితి మరింత దిగజారి, నిరోధించే క్రమంలో ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

**గ్రామస్తుల డిమాండ్: రాత్రి గస్తీ పునరుద్ధరించాలి**

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాల్సిన పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించాలని ముదోల్, తానుర్, నిర్మల్, లోకేశ్వరం, భైంసా, కుంటాల, సారంగాపూర్ పరిధిలోని పల్లె ప్రజలు కోరుతున్నారు. ప్రతి గ్రామంలో రాత్రి వేళల్లో పోలీసుల గస్తీని ముమ్మరం చేయాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో పాడైపోయిన సీసీ కెమెరాలను పునరుద్ధరించి, 'నేను సైతం' కార్యక్రమం కింద మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రాత్రి వేళల్లో గ్రామాల్లో యువతతో కూడిన స్వచ్ఛంద నిఘా కమిటీలను ఏర్పాటు చేయడానికి పోలీసు శాఖ సహకరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి, పల్లెల్లో శాంతిభద్రతలను కాపాడి తమకు దొంగల భయం నుండి విముక్తి ప్రసాదించాలని నిర్మల్ జిల్లా గ్రామీణ ప్రజలు వేడుకుంటున్నారు.

## భవన నిర్మాణ కార్మికులు జూలై 23 లోగా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లాలోని నమోదైన భవన నిర్మాణ కార్మికులందరూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల గ్రూప్ ఇన్సూరెన్స్ సంక్షేమ పథకాల కొరకు ఈనెల జూలై 23వ తేదీ లోగా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ముత్యం రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ద్వారా అందుతున్న సహజ మరణం రిలీఫ్, ప్రమాదవశాత్తు మరణం రిలీఫ్, మరియు దివ్యాంగుల రిలీఫ్ వంటి సంక్షేమ పథకాల ప్రస్తుత పాలసీ కాలపరిమితి జూలై 23వ తేదీతో ముగుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా పరిధిలో లేబర్ కార్డు కలిగి ఉన్న అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరూ తమ దరఖాస్తులను త్వరితగతిన సమర్పించాలన్నారు. సందేహాల కొరకై కార్మికులు జిల్లా కలెక్టరేట్ ఐడీఓసీ బిల్డింగ్ మొదటి అంతస్తులోని రూమ్ నెంబర్ ఎఫ్14 లో గల జిల్లా కార్మిక కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు.

## గోదావరిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన బాసర పోలీసులు

బాసర, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా బాసర గోదావరి నది వంతెన వద్ద గురువారం ఒక మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యకు యత్నించగా, డ్యూటీలో ఉన్న బాసర పోలీసులు సకాలంలో స్పందించి వారి ప్రాణాలను కాపాడారు. పోలీసుల వివరాల ప్రకారం, నిర్మల్ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన రాపన్వాడ్ ఉమాబాయి కుటుంబ గొడవల నేపథ్యంలో తన భర్త శివాజీతో గొడవపడి తీవ్ర మనస్తాపానికి గురైంది. జీవితంపై విరక్తి చెంది తన ఇద్దరు చిన్న పిల్లలను తీసుకుని బాసర గోదావరి ఘాట్ వద్దకు వచ్చింది. నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుండగా, అక్కడ విధుల్లో ఉన్న బాసర పోలీసు సిబ్బంది గమనించి హుటాహుటిన ఆమెను, పిల్లలను అదుపులోకి తీసుకుని సురక్షితంగా రక్షించారు. అనంతరం పోలీస్ స్టేషన్ కు తరలించి, కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి భర్తకు అప్పగించారు. సమయస్ఫూర్తితో స్పందించి ముగ్గురి ప్రాణాలు కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.




## భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

### - బాబుల్ గావ్ గ్రామంలో రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్

భైంసా, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన భైంసా మండలం బాబుల్ గావ్ గ్రామంలో క్షేత్రస్థాయిలో సాగుతున్న భూముల రీసర్వే డిజిటల్ పనులను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాలకు సరికొత్తగా ఆధునిక మ్యాపులు తయారు చేసేందుకు చేపట్టిన సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యంత అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీ సాంకేతికతను వినియోగించి ఈ రీసర్వే ప్రక్రియను చేపట్టిందన్నారు.



**రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి పెట్టాలి:**
రీసర్వే ప్రక్రియ మొత్తాన్ని ముందస్తుగా నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని ల్యాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామ రైతులు, రైతాంగంతో నేరుగా ముచ్చటించి, ఉమ్మడి జిల్లాలో నీటి లభ్యతను బట్టి రైతులందరూ తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ నరసింహ మూర్తి, తహసిల్దార్ శశి భూషణ్, ఎంపీడీవో నీరజ్ కుమార్, గ్రామ సర్పంచ్ అనసూయ మహేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు నాణ్యంగా కుట్టాలి

నిర్మల్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే ఏకరూప దుస్తులు (యూనిఫాంలు) అత్యంత నాణ్యతా ప్రమాణాలతో తయారు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని స్కంద ఔట్ ఫిట్ కుట్టు శిక్షణ తయారీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కొరకు సిద్ధమవుతున్న ఏకరూప దుస్తుల కుట్టు తయారీ తీరును కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా దుస్తుల క్లాత్ నాణ్యత, కుట్టు విధానం, సైజుల వారీగా పంపిణీకి సంబంధించిన వివరాలను విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బడులు తెరిచినందున విద్యార్థులకు ఎలాంటి ఆలస్యం లేకుండా నిర్ణీత సమయానికి యూనిఫాంలు తయారు చేసి అందించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, కుట్టు కేంద్రం నిర్వాహకులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## భైంసాలో అధికారుల చొరవతో 14 ఏళ్ల బాలిక బాల్య వివాహం విజయవంతంగా నిలిపివేత

భైంసా, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భైంసా మండల పరిధిలోని ఒక గ్రామంలో 14 సంవత్సరాల బాలికకు జరగాల్సిన బాల్య వివాహాన్ని జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీసు, రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించి విజయవంతంగా అడ్డుకున్నారు. అధికారుల వివరాల ప్రకారం, మైనర్ బాలికకు రహస్యంగా బాల్య వివాహం జరగనున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల ప్రకారం జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గురువారం ఉదయం సదరు గ్రామానికి చేరుకున్నారు. బాలిక కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్ నిర్వహించి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల బాలికల శారీరక, మానసిక, విద్యా, ఆరోగ్యపరమైన ఎదుగుదల దెబ్బతింటుందన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయన్నారు. అధికారుల కౌన్సెలింగ్‌తో తప్పు తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, తమ కుమార్తెకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం జరిపిస్తామని లిఖితపూర్వకంగా స్వీయ ప్రకటన పత్రాన్ని రాసిచ్చారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి మురళి, సూపర్‌వైజర్ శ్రీజని, కౌన్సెలర్లు శైలజ, కరుణశ్రీ పాల్గొన్నారు.




## సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రపంచ పాముల దినోత్సవ సదస్సు

సారంగాపూర్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో పాముల పాత్ర అత్యంత కీలకమని, వాటిని చంపకుండా రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉప అటవీ క్షేత్ర అధికారి (డిప్యూటీ రేంజ్ ఆఫీసర్) మహమ్మద్ నజీర్ ఖాన్ అన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో 'ప్రపంచ పాముల దినోత్సవం' పురస్కరించుకుని గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నజీర్ ఖాన్ మాట్లాడుతూ, పాములు ఎలుకలు వంటి పంటలకు హాని చేసే జీవులను తిని నియంత్రించడం ద్వారా రైతులకు ప్రకృతి సిద్ధంగా ఎంతో మేలు చేస్తాయన్నారు. అన్ని పాములు విషసర్పాలు కావని, కొద్ది జాతులు మాత్రమే విషపూరితమైనవని వివరించారు. ఈ సందర్భంగా స్నేక్ క్యాచర్, సామాజిక సేవకుడు షేర్ యాసిన్ పాల్గొని వివిధ రకాల పాములు, వాటి గుర్తింపు, పాములు కనిపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఇన్-ఛార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అటవీశాఖ అధికారులు, వెన్నెల సుజాత పాల్గొన్నారు.






# ఒకే దేశం - ఒకే ఎన్నికలు..!

## రాజ్యాంగ విరుద్ధం, అహేతుకం




భారతదేశంలో లోక్‌సభ మరియు అన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు వీలుగా, సరికొత్త రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రతిపాదిత బిల్లు ద్వారా మన రాజ్యాంగంలో కొత్తగా నిబంధన 82ఏ ను చేర్చడంతో పాటు, నిబంధనలు 83, 172 లను సవరించాలని యోచిస్తున్నారు. అయితే ఈ చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందాలంటే ఉభయ సభలలో 2/3 వంతు మంది సభ్యుల ప్రత్యేక సమ్మతితో పాటుగా, దేశంలోని కనీసం సగానికి పైగా రాష్ట్రాల శాసనసభల అధికారిక ఆమోదం కూడా ఖచ్చితంగా అవసరమవుతుంది. దేశ మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి సంఘం సమర్పించిన సమగ్ర నివేదిక ఆధారంగానే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనతో ముందుకు సాగుతోంది. ఈ ఉన్నత స్థాయి సంఘ నివేదిక ప్రధానంగా ఎన్నికల వ్యయాల తగ్గింపు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వల్ల పాలనలో ఏర్పడే తాత్కాలిక స్తబ్దత నుండి విముక్తి, ప్రభుత్వ అధికార యంత్రాంగం, ఉద్యోగులపై పడే అదనపు భారాన్ని తగ్గించడం, అలాగే దేశ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడం వంటి 4 ముఖ్యమైన లక్ష్యాల ప్రాతిపదికన సిద్ధమైంది. జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల దేశ స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు సుమారు 1.5 శాతం మేర పెరుగుతుందని ఈ నివేదికలో ప్రముఖ ఆర్థిక నిపుణుల పరిశోధనలను ఉటంకిస్తూ పేర్కొన్నప్పటికీ, మన దేశ సుదీర్ఘ చారిత్రక వాస్తవాలను పరిశీలిస్తే ఈ వాదనలు ఎంతమాత్రం నిలబడలేవని స్పష్టమవుతోంది.

మన దేశ చరిత్రను ఒక్కసారి గమనిస్తే, ఉమ్మడి ఎన్నికలు జరిగిన తొలి రోజుల్లో అంటే 1952 నుండి 1967 వరకు దేశ ఆర్థిక వృద్ధి రేటు కేవలం 3.5 శాతంగా మాత్రమే నమోదైంది. ఆనాటి ఆర్థిక స్థితిని నిపుణులు అత్యంత మందగమన వృద్ధిగా అభివర్ణించేవారు. కానీ దీనికి పూర్తి విరుద్ధంగా, వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరిగిన 2003 నుండి 2011 మధ్య కాలంలో దేశం 8 నుండి 9 శాతం అత్యధిక వార్షిక ఆర్థిక వృద్ధిని నమోదు చేసి సరికొత్త మైలురాయిని చేరుకుంది. కాబట్టి ఎన్నికలన్నీ ఒకేసారి జరగడమే దేశ ఆర్థిక వృద్ధికి ప్రధాన కారణం అనడం ఎంతమాత్రం సమంజసం కాదు. అలాగే ఎన్నికల వ్యయం విషయానికి వస్తే, ప్రభుత్వం అధికారికంగా భరించే ఎన్నికల వ్యయం దాని మొత్తం ఆదాయ వ్యయాల ప్రణాళికలో 0.1 శాతం కంటే చాలా తక్కువగా ఉంటుంది. నిజానికి ఎన్నికల సమయంలో జరిగే విపరీతమైన వ్యయమంతా అభ్యర్థులు,రాజకీయ పక్షాలు చేసే అనధికారిక వ్యయాల రూపంలోనే సాగుతుంది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే దాదాపు రూ. 1,00,000 కోట్లకు పైగా లెక్కల్లో లేని అక్రమ ధనం చేతులు మారిందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఈ భారీ అక్రమ ధన ప్రవాహాన్ని నియంత్రించడం సాధ్యపడదు సరికాదా, ఇది ఆ వ్యయాన్ని అంతా ఒకే సమయంలో మరింతగా కేంద్రీకరిస్తుంది. నిరంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటం వల్ల దేశవ్యాప్తంగా అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని వాదించే వారు, ఒకేసారి ఎన్నికల వల్ల 5 ఏళ్లకు ఒకసారి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఒకే సమయంలో అభివృద్ధి పనులు పూర్తిగా స్తంభించిపోయే తీవ్రమైన ఆటంకాన్ని గమనించడం లేదు.

రాజ్యాంగ పరమైన కోణం నుండి ఈ ప్రతిపాదనను విశ్లేషిస్తే, సుప్రసిద్ధ కేశవానంద భారతి కేసులో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ప్రకారం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, పారదర్శకమై, ఉచిత ఎన్నికల నిర్వహణ అనేవి రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగాలు. కాబట్టి ఎలాంటి అత్యవసర చట్ట సవరణల ద్వారా కూడా ఈ మూల సూత్రాలను మార్చడానికి వీలులేదు. ఒకవేళ ఒకేసారి ఎన్నికల విధానం అమల్లోకి వచ్చిన తర్వాత, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం మధ్యలోనే తన శాసనసభ విశ్వాసాన్ని కోల్పోతే, అక్కడ తదుపరి 5 ఏళ్ల కాల పరిమితి ముగిసే వరకు ప్రజాదరణ లేని బలహీనమైన ప్రభుత్వం కొనసాగాల్సి వస్తుంది లేదా సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలనను విధించాల్సి వస్తుంది. ఈ రెండు పరిస్థితులు కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధమైనవి. దీనితో పాటుగా, ఈ విధానాన్ని బలవంతంగా ప్రవేశపెట్టడం కోసం కొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని అడ్డగోలుగా పెంచడం లేదా తగ్గించడం చేయాల్సి వస్తుంది. ఇది ప్రజలు తమ ప్రతినిధులకు 5 ఏళ్ల పాటు పరిపాలించేందుకు ఇచ్చిన పవిత్రమైన తీర్పును, వారి ప్రాథమిక ఓటు హక్కును కాలరాయడమే అవుతుంది. జాతీయ స్థాయి ఎన్నికలు, ప్రాంతీయ స్థాయి ఎన్నికలు ఒకేసారి జరగడం వల్ల సాధారణ ఓటర్లపై జాతీయ పార్టీల ప్రచారం, జాతీయ స్థాయి అంశాల ప్రభావం ఎక్కువగా ఉండి, వారు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీకి ఓటు వేసే అవకాశం పెరుగుతుంది. దీనివల్ల స్థానిక సమస్యలపై పోరాడే చిన్న, ప్రాంతీయ పార్టీల ఉనికి తీవ్రంగా దెబ్బతిని, సమాఖ్య స్ఫూర్తి నిర్వీర్యమవుతుంది.

ఈ ప్రతిపాదిత జమిలి ఎన్నికల విధానంలో మన రాజ్యాంగం కల్పించిన మూడో అంచె ప్రభుత్వాలైన గ్రామ పాలక సంస్థలు, పురపాలక సంఘాల ఉనికిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం మరొక పెద్ద లోపం. రాజ్యాంగ సవరణలైన 73, 74 నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రావు, అవి పూర్తిగా రాష్ట్ర ఎన్నికల సంఘాల స్వతంత్ర పరిధిలో ఉంటాయి. మన దేశంలోని ముంబై, బెంగళూరు లాంటి పెద్ద నగరాల పురపాలక బడ్జెట్లు కొన్ని చిన్న రాష్ట్రాల మొత్తం బడ్జెట్ కంటే చాలా పెద్దవిగా ఉంటాయి. ఈ స్థానిక సంస్థల ఎన్నికలను జమిలి ఎన్నికల పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల ఎన్నికల వ్యయాలు, భద్రతా దళాల మోహరింపు, పరిపాలనాపరమైన సవాళ్లు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం ఆశిస్తున్న భారీ వ్యయాల ఆదా అనేది కేవలం ఒక ఊహాజనిత భ్రమగా మాత్రమే మిగిలిపోతుందని స్పష్టమవుతోంది. మన రాజకీయ వ్యవహారాల్లో నిజంగా మార్చాల్సిన తీవ్రమైన సమస్యలైన పరిమితి లేని రాజకీయ పార్టీల వ్యయాలు, ఓటర్లకు విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ, రాజకీయ రంగంలో పెరిగిపోతున్న నేరమయం ,అధికార దుర్వినియోగం వంటి అసలైన రుగ్మతలను ఈ సరికొత్త చట్టం ఏమాత్రం పరిష్కరించడం లేదు. ప్రజాస్వామ్య రక్షణకు నిజంగా కావాల్సింది రాజకీయ విరాళాల పారదర్శకత, నేరచరితులకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా కఠినమైన చర్యలు చేపట్టడం, ఎన్నికల సంఘానికి మరింత స్వతంత్ర అధికారాలు కల్పించడం. అంతేకాని కేవలం ఎన్నికల క్యాలెండర్‌ను మార్చడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలోని అసలైన లోపాలు ఏమాత్రం సరిదిద్దబడవు.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

## హిందువులపై దాడులు జరిగితే అందరూ సంఘటితంగా ఉద్యమించాలి

- ఆర్మూర్ లో వైభవంగా ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర ప్రారంభం
- ఇస్కాన్ మందిర నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయింపునకు మున్సిపల్ ఫైల్ పై సంతకం చేయాలి



ఆర్మూర్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు): హిందువులపై ఎక్కడ దాడులు జరిగినా అందరూ కులమతాలకు అతీతంగా సంఘటితమై కలిసికట్టుగా ఉద్యమిస్తేనే భవిష్యత్తు ఉంటుందని ఆర్మూర్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్మూర్ పట్టణ పరిధిలోని పెర్కిట్ చౌరస్తా వద్ద ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించిన జగన్నాథ రథయాత్రను మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి రఘుతో కలిసి ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇటీవల కాలంలో హిందూ కుటుంబాలపై దాడులు జరుగుతున్నా వ్యాపారస్తులు, ప్రజలు ఆందోళనల్లో చురుగ్గా పాల్గొనకపోవడం బాధాకరమన్నారు. పిప్రిలో హిందువు ఇల్లు దగ్ధం చేసినప్పుడు స్థానికులు స్పందించలేదని ఆరోపించారు. ఒకరిపై దాడి జరిగినప్పుడు అందరూ ఇళ్ల నుంచి బయటకు రాకపోతే రాబోయే రోజుల్లో హిందువుల పరిస్థితి దారుణంగా మారుతుందన్నారు.

భవ్య మందిర నిర్మాణానికి స్థలం:

ఆర్మూర్ పట్టణంలో అంతర్జాతీయ ఇస్కాన్ మందిర నిర్మాణానికి 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లహరి రఘు ఈ స్థలం కేటాయింపు ఫైల్ పై తక్షణమే సంతకం చేస్తే ఆ స్థలంలో భవ్య మందిర నిర్మాణం జరుగుతుందన్నారు. అనంతరం జగన్నాథ రథయాత్ర త్రాడును లాగి రథాన్ని ప్రారంభించారు. శాంతిభద్రతల దృష్ట్యా సీఐ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ పండిత్ పవన్, ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పెద్దల గంగారెడ్డి, కౌన్సిలర్లు బొట్టు నాగరాజు, పాన్ శ్రీనివాస్, జీజీ ఫౌండేషన్ చైర్మన్ గుజరాతి నివేదన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని బాసరాలో గ్రామదేవతలకు గోదావరి జలాభిషేకాలు



బాసర, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు - ప్రత్యేక వార్తా కథనం): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా జిల్లా వ్యాప్తంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో బాసర మండల రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో, వరుణ దేవుడిని ప్రసన్నం చేసుకునేందుకు బాసర గ్రామస్తులు వినూత్న ఆధ్యాత్మిక బాట పట్టారు. గురువారం రెండో రోజు కూడా సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ గ్రామంలోని పోచమ్మ దేవాలయం నుండి పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు కలిసి కాలినడకన గోదావరి ఘాట్ వరకు పాదయాత్రగా వెళ్లారు. అక్కడ పవిత్ర గోదావరి నది జలాలను బిందెల్లో నింపుకుని, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా నృత్యాలు చేస్తూ శివాలయం వరకు తరలివచ్చారు.

గోదావరి జలాలతో శివలింగానికి పూజలు:

పవిత్ర గోదావరి నది జలాలతో శివాలయంలోని లింగాకార పరమశివునికి, అలాగే గ్రామ దేవతలందరికీ గంగాజలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు 'కరుణించు వరుణ దేవా.. వానమ్మ వానమ్మ' అంటూ వాన రాకను కోరుకుంటూ కన్నీళ్లతో కూడిన భక్తి గీతాలను ఆలపించారు. రైతులందరికీ మేలు జరిగేలా వరుణ దేవుడు కరుణించి సంపూర్ణంగా వర్షాలు కురిపించాలని, కాలనీ ప్రజలు కరువు బారిన పడకుండా కాపాడాలని వరుణుడికి పాదాభివందనాలు చేసి వేడుకున్నట్లు బాసర గ్రామస్తులు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి: కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




నిర్మల్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హునికి చేరేలా అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కార ప్రక్రియలను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు కమిషన్ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ జానకి షర్మిల పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధి హామీ కల్పనలో నిర్మల్ జిల్లా ముందంజ:

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును అత్యంత పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వసతులు కల్పిస్తూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని వివరించారు. ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, అట్రాసిటీ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విట్టోలి పొలాల్లో అరుదైన రెండు పాముల 'సమరం'.. సోషల్ మీడియాలో వైరల్



ముధోల్, జూలై 16 (తెలంగాణ వెన్నెల వాక్కు - వార్తా కథనం): ముధోల్ మండల పరిధిలోని విట్టోలి గ్రామ శివారు పంట పొలాల్లో గురువారం ఒక అరుదైన ప్రకృతి దృశ్యం చోటుచేసుకుంది. వ్యవసాయ పనుల్లో ఉన్న స్థానిక రైతులకు పొలంలో రెండు పెద్ద పాములు ఒకదానితో ఒకటి తలపడుతూ పెనవేసుకుని చేసిన పోరాట (సమరం) దృశ్యం ఆశ్చర్యానికి గురిచేసింది. పొలంలో గడ్డి పరకల మధ్య రెండు పాములు అత్యంత వేగంగా గాల్లోకి లేస్తూ, ఒకదానికొకటి బంధించుకుంటూ సమరం చేస్తున్నాయి. ఈ అరుదైన దృశ్యాన్ని గమనించిన సదరు రైతు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన మొబైల్ ఫోన్ కెమెరాలో ఆ దృశ్యాలను వీడియోగా బంధించారు.

వైరల్ గా మారిన వీడియో:

ప్రస్తుతం ఈ రెండు పాముల పోరాటానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో (సోషల్ మీడియా) విపరీతంగా వైరల్ గా మారింది. ప్రకృతి నిపుణులు, వన్యప్రాణి శాస్త్రవేత్తల ప్రకారం, సాధారణంగా సంతానోత్పత్తి కాలంలో లేదా తమ నివాస సరిహద్దును (టెరిటరీ) కాపాడుకునే క్రమంలో మగ పాములు ఇలా ఒకదానితో ఒకటి సుదీర్ఘంగా తలపడతాయని వెల్లడించారు. పంట పొలాల్లో ఇలాంటి అరుదైన దృశ్యాలు కనిపించడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. పాములను చూసి రైతులు, గ్రామస్థులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, వాటిని హింసించకుండా సురక్షిత దూరంలో ఉండాలని వన్యప్రాణి ప్రేమికులు సూచిస్తున్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com